క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న కళావతి

చేర్యాల(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి మండల మధ్యాహ్న భోజన కార్మికులు ఐకమత్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వజ్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. కార్మికులకు రెండు జతల కాటన్ దుస్తులు, వంట సామగ్రి ఇవ్వాలని కోరారు. అలాగే వంట గదులు నిర్మించాలన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్



సమావేశంలో పాల్గొన్న కోఆప్షన్ సభ్యులు

దౌల్తాబాద్(దుబ్బాక): తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రహీమొద్దీన్ అన్నారు. ఆదివారం దుబ్బాక నియోజకవర్గంలోని ఆయా మండలాల కోఆప్షన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్, దౌల్తాబాద్ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, తొగుట కోఆప్షన్ సభ్యుడు కలిమొద్దీన్, చేగుంట కోఆప్షన్ అహ్మద్ అలీ, నార్సింగ్ కోఆప్షన్ ఇలియాస్, రాయపోల్ కోఆప్షన్ పర్వేజ్, దుబ్బాక కోఆప్షన్ ఆసిఫ్ పాల్గొన్నారు.

గిరిజన బంధుపై స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భానోతు అనిల్‌నాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన బంధు అమలు చేసి గిరిజన కుటుంబాలకు అండగా నిలుస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ పది నెలలైందని బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భానోతు అనిల్‌నాయక్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన బంధు జీఓ విడుదల చేయాలని లేకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు అమలు చేస్తున్న ప్రభుత్వం గిరిజనులపై ఎందుకు వివక్ష చూపుతుందో అర్థం కావడంలేదన్నారు. మరో 90 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో గిరిజన బంధు అమలుపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలని, లేనిపక్షంలో గిరిజన తండాల్లో ప్రచారానికి వచ్చే నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యి రైనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేను మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు నిర్మాణ పత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత డబ్బు రూ.10 లక్షలు నిర్మాణానికి అందజేస్తానని తెలిపినట్లు చెప్పారు.

అంతక్కపేట శివారులో 'ఓపెన్ జిమ్'



అంతక్కపేటలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్

అక్కన్నపేట(హుస్నాబాద్): అంతక్కపేట సర్పంచ్ ఇర్రి లావణ్యరాజిరెడ్డి చొరవతో గ్రామశివారులోని మర్రికుంట పక్కన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈనెల 15వ తేదీ తర్వాత జిమ్ ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. జనగామ, చౌటపల్లి, అంతక్కపేట గ్రామస్తులకు ఈ జిమ్ అందుబాటులో ఉంటుంది.

చేనేత హస్తకళా.. అదుర్స్

- జోరుగా వస్త్ర, అలంకరణ వస్తువుల విక్రయాలు
- సందర్శకులను ఆకట్టుకుంటున్న మేళా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని శివమ్స్ గార్డెన్‌లో కొనసాగుతున్న చేనేత హస్తకళా బజార్ పట్టణ ప్రజలను ఆకర్షిస్తోంది. ఈ ప్రదర్శన, విక్రయశాలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి, మంగళగిరి, గద్వాల, నారాయణపేట, వరంగల్, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్ కొయ్య బొమ్మలు, ఆరోగ్య, పురాణ, దైవిక, ఆధ్యాత్మిక, ఆయుర్వేద, యోగ, విద్య, వైజ్ఞానిక, డిక్షనరీలు, ప్రసిద్ధ కవులు, రచయితల పుస్తకాలు, మహిళల ఆభరణాలు, హైదరాబాద్ ముత్యాలు, చార్మినార్ గాజులు, మైసూర్ రోజ్‌వుడ్, సహరన్‌పూర్ వుడ్ కార్వింగ్, పూతరేకులు, అప్పాలు, లడ్డూలు, మైసూర్ అగర్‌బత్తీలు, పూజ సామగ్రి విక్రయిస్తున్నారు. ఈ ప్రదర్శన 20వ తేదీ వరకు కొనసాగనుంది.



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న సందర్శకులు

చాలా బాగున్నాయి



ఇక్కడి వస్తువులు చాలా బాగున్నాయి. నేను పోచంపల్లి చీర ఖరీదు చేశా. అలాగే అలంకరణ వస్తువులను కొనుగోలు చేశాను. బయటి మార్కెట్‌లో వీటి ధర చాలా ఎక్కువగా ఉంటాయి. అన్ని వస్తువులు ఒకేచోట లభించడం సంతోషంగా ఉంది. వంటింటి సంబంధించిన పుస్తకాలు కూడా ఉన్నాయి.
– రియా, సిద్దిపేట

ఏటా ఖరీదు చేస్తా



చేనేత హస్తకళా ప్రదర్శన విక్రయశాలకు ఏటా వస్తాను. నాకు అవసరమైన వాటిని ఇక్కడే కొనుగోలు చేస్తా. ఇక్కడ నాణ్యమైనా వస్త్రాలతో పాటు గృహోపకరణాలు కూడా ఉంటాయి. చేనేత వస్త్రాలు ధరించడం అలవాటు. దీంతో ఏటా తప్పనిసరిగా దుస్తులు, టవల్స్ ఖరీదు చేస్తాను.
– యాశ, సిద్దిపేట

పరిశుభ్రతకు పది నిమిషాలు

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలో ఆదివారం 10 గంటల 10 నిమిషాల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి నిల్వచేసిన నీటిని, పిచ్చి మొక్కలను తొలగించారు. వారంలో ఒక రోజు ఇంటి శుభ్రతకు కేటాయించాలన్నారు. ఇలా చేస్తే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్ పాల్గొన్నారు.



కుండలోని నీటిని తొలగిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

మోదీ పాలనలో విశ్వగురువుగా భారత్



పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

గజ్వేల్‌రూరల్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారత దేశం విశ్వగురువుగా నిలుస్తుందని బీజేపీ, బీజేవైఎం నాయకులు పేర్కొన్నారు. నా మట్టి.. నాదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని తూప్రాన్ రోడ్డు నుంచి ప్రజ్ఞాపూర్ వరకు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ ఐక్యత కోసం సాహస నిర్ణయాలను తీసుకుంటున్నారని, ఆర్టికల్ 370ను రద్దు చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ల శ్రీనివాస్, కార్యదర్శి కుడిక్యాల రాములు, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ మన్నె శేఖర్ పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



నర్సాపూర్: పీర్ల ఊరేగింపులో సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నిర్వహించిన పీర్ల ఉత్సవంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సుధాకర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, నగేశ్, కంది శంకర్, కాలనీ వాసులు బాల్‌రాజ్, బాబా, ఇస్మాయిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.
తూప్రాన్: మండలంలోని అల్లాపూర్‌లో పీర్ల పండగ కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు.

చల్లంగా చూడు పోచమ్మ తల్లి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని అప్పాయిపల్లిలో ఆదివారం గ్రామ దేవత పోచమ్మకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పాడిపంటలతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో చల్లంగా చూడుతల్లి అని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలక వర్గం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి నిధులు మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ రెడ్డి సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం మంజూరు పత్రాన్ని సంఘం అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందజేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నిధులు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మకు రెడ్డి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండ



చెక్కు అందజేస్తున్న సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని కాసులాబాద్‌లో కంది రాజయ్యకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. అర్హులు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కులవృత్తిపై మాట్లాడలేదు'

శివ్వంపేట(నర్సాపూర్): గౌడ కులవృత్తిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఈత వనాల రైతు సంఘం మండలాధ్యక్షుడు బాలేశ్, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈత చెట్ల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం పోత్సహించడం వల్ల మా పట్టా భూముల్లో ఈత వనం పెంచామని, అందుకు సంబంధించి సంఘం ఏర్పాటు చేసుకొని పిట్ల సత్యనారాయణను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నమన్నారు. గౌడ సంఘం నేతలు అతన్ని విమర్శించడం సరికాదన్నారు.

మహిళలకు అండగా కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి కార్తీక గౌడ్

దుబ్బాక: మహిళలకు అండగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి కార్తీక గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పిలుపు మేరకు శక్తి సూపర్ షీ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున మహిళలతో పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. త్రివర్ణ పతకాన్ని మహిళలతోనే ఎగరవేయిస్తామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఆరోపించారు. మణిపూర్ ఘటనపై మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించక పోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైన్స్ టెండర్ల దరఖాస్తులకు 20 రోజుల సమయం ఇచ్చి గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం తిరిగి వస్తుందన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500లకు, మహిళలకు రూ.4 వేల పెన్షన్ అమలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌రావు, దేవిరెడ్డి, జలేందర్ రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం



1997–98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): వారందరూ 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు. మిరుదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ తర్వాత వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆత్మీయ సమ్మేళం ఏర్పాటు చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ట్రాఫిక్ పోలీసుల సహకారంతో..

బ్యాగు దక్కించుకున్న ప్రయాణికుడు

గజ్వేల్‌రూరల్: బస్సులో ఓ ప్రయాణికుడు తన బ్యాగును మరచిపోయి వెళ్లినా ట్రాఫిక్ పోలీసులు సహకారంతో దక్కించుకున్నాడు. దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన రామగిరి గోపాల్ వృత్తిరీత్యా సికింద్రాబాద్ అల్వాల్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో బస్సును అల్వాల్‌లో ఎక్కి ప్రజ్ఞాపూర్‌లో దిగాడు. అయితే తన బ్యాగును బస్సులో మరచిపోయానని గుర్తించి అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రఘుకు సమాచారం ఇచ్చాడు. హెడ్‌కానిస్టేబుల్ ఆర్టీసీ డిపో కంట్రోలర్‌తో మాట్లాడి సదరు బస్సు కండక్టర్‌కు బ్యాగు విషయం తెలియజేశాడు. బస్సు ప్రజ్ఞాపూర్‌కు రాగానే గోపాల్‌కు అప్పగించాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గోపాల్ కృతజ్ఞతలు తెలిపాడు.



బ్యాగును అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రఘు

మంత్రిని కలిసిన ముదిరాజ్ నేతలు

మర్కూక్(గజ్వేల్): ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేకల కనకయ్య ఆదివారం మంత్రి హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. కనకయ్యను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, రాజు ఉన్నారు.



మంత్రికి శాలువా కప్పతున్న నాయకులు

రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ యువకులు ఆదివారం మండల కేంద్రం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు సుమన్, జగదీశ్, మహేశ్ తదితరులు మాట్లాడుతూ.. రేగోడ్ మండలం మెదక్ జిల్లాలో ఉండటం కారణంగా మండలంలోని ఎంతోమంది యువత కొద్ది మార్కులతో ఉద్యోగాలను పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాల భవిష్యత్, యువతకు ప్రైవేట్ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి కల్పన, సామాన్య పౌరులకు సైతం జిల్లా అధికారులు పరిపాలన సౌలభ్యానికి పోరాడుతుంటే కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరుద్యోగులకు సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్ కారణంగా ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. భౌగోళికంగా మెదక్ జిల్లా కంటే సంగారెడ్డి జిల్లానే రేగోడ్ మండలానికి అనుకూలంగా ఉంటుందని తెలిసినప్పటికీ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం మెదక్ జిల్లాలో రేగోడ్ మండలాన్ని కలిపి యువత భవిష్యత్‌ను బలి చేశారని అన్నారు. ప్రజల భవిష్యత్‌పై నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్, సతీశ్, పరమేశ్వర్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న యువకులు

సంక్షిప్త వార్తలు

◆ **ఉచిత వైద్య శిబిరం**



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జ్వరాల భారినపడిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రమేశ్, డాక్టర్ విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **రైస్ మిల్లర్ల అసోసియేషన్ కమిటీ ఎన్నిక**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రైస్ మిల్లర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా నేతి నారాయణ, ఉపాధ్యక్షుడిగా పాల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పులిగిల్ల సుధాకర్, కోశాధికారిగా చిట్ట విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా బుక్కా రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **నగర సంకీర్తన**

హుస్నాబాద్: పట్టణంలో పుట్టపర్తి యాత్ర కోసం శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నగర వీధుల్లో మహారాజ నగర సంకీర్తన నిర్వహించారు. సెప్టెంబర్ 23, 24, 25వ తేదీల్లో నిర్వహించే పుట్టపర్తి యాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, కో కన్వీనర్ కొత్తపల్లి రవీందర్, ప్రతినిధులు రవితేజ, కుమార్, జయ, లక్ష్మి, రాణి, నాగరాణి, విజయ, చంద్రకళ, స్వరూప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

◆ **బీసీలకు కోహెడ మార్కెట్ చైర్మన్**

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మార్కెట్ చైర్మన్ బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మెజార్టీ ఎమ్మెల్యేలు రెడ్డి కులస్తులే ఉన్నారని, మండలస్థాయి పదవులు వారికే కట్టబెట్టడం సరికాదన్నారు. కార్పొరేషన్ పదవులలో బీసీలకు మొండిచేయి చూపిస్తున్నరని ఆరోపించారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 18 శాతానికి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బీసీలకు పదవులు దక్కలేదన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ స్పందించి బీసీలకు కోహెడ మార్కెట్ చైర్మన్ పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు.

◆ **46మందికి బీసీ బంధు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని మానకొండూర్‌లో ఆదివారం సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, బీసీ బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 46 మందికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బీసీబంధు చెక్కులు అందజేశారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

గజ్వేల్‌రూరల్: ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడలో చేపట్టిన ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.31 వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. నిర్మాణంలో భాగస్వామికావడం సంతోషంగా ఉందన్నారు.

◆ **మెరుగైన వేతన ఒప్పందానికి కృషి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో జరిగే వేతన ఒప్పందంలో కార్మికులకు మెరుగైన వేతనం సాధించడానికి తెలంగాణ కార్మిక రక్షణ సమితి అన్ని యూనియన్ల సహకారంతో సమరశీల పోరాట చేస్తుందని టీకేఆర్ఎస్ అధ్యక్షుడు హుగ్గేలి రాములు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మద్దికుంట శివారులో అన్ని యూనియన్ల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేతన ఒప్పందంలో పరిశ్రమ మొండి వైఖరినివీడి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

◆ **బీజేపీలో చేరిక**

హుస్నాబాద్: హుస్నాబాద్ మండలం నాగారం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. పార్టీ కండువ కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో హుస్నాబాద్ గడ్డ పై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

◆ **ఫోన్‌పోతే ఆందోళన చెందొద్దు**



మద్దూరు(హుస్నాబాద్): ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందనవసరంలేదని ఏఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జుల్ఫీకర్ అలీ అదీబ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి ఫిర్యాదుదారుడికి ఆదివారం ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ఫోన్ పోయిన 24 గంటలలోపు ఈఐఎం నంబర్ ద్వారా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

◆ **రక్తదానం చేసిన కానిస్టేబుళ్లు**

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసర సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు స్పందించి రక్తదానం చేశారు. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు చికిత్స సమయంలో అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న సిద్దిపేట వన్ టౌన్ కానిస్టేబుల్ రాదారి శ్రీనివాస్, ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ స్పందించి వెంటనే బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు.

◆ **'రంగంపేటను మండల కేంద్రంగా ప్రకటించాలి'**

కొల్చారం(నర్సాపూర్): గతంలో వ్యాపార వాణిజ్య మండల కేంద్రంగా కొనసాగిన రంగంపేటను తిరిగి మండల కేంద్రంగా సీఎం కేసీఆర్ ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని ఇప్పటికే హామీ ఇచ్చి ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు.